# మోడీ దిష్టిబొమ్మ దగ్ధం
# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా

**కేంద్ర వైఖరిపై మండిపడ్డ కాంగ్రెస్ శ్రేణులు**
**ఎమ్మెల్యే మందుల సామెల్ ఆదేశాలతో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన**
**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**
**రాచకొండ బాలరాజు డిమాండ్**



**మన తొలివెలుగు, మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, నిరుద్యోగం, విద్యార్థుల సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీని కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ మోత్కూరు మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ఆదేశాల మేరకు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు నల్లబాడ్జీలతో నిరసన తెలిపి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ బాలరాజు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తూ.. ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనిగా పెట్టుకుందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతు నొక్కేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని, ఇటువంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు, పాక్స్ పీఏసీఎస్ చైర్మన్ పేలంపూడి వెంకటేశ్వర్లు చౌదరి, డీసీసీ కార్యదర్శి కూరెళ్ల శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు అన్నేపు పద్మ, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, సుంకుశాల అనిల్, బద్దం నాగార్జునరెడ్డి, పల్లపు సమ్మయ్య, చింతల విజయ భాస్కర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ పాలోజు శేఖరాచారి, ఆలకుంట్ల రాజు, చిరుమర్తి యాదయ్య, రంగారెడ్డి, బందేల రవి, నకిరేకంటి రామనరసయ్య, అవిశెట్టి రాజాలు, బత్తినీ శేఖర్, మెంట యాదగిరి, పల్లె బిక్షం, తాటిపాముల మహేందర్, కురిమెటి సైదులు, కురిమెటి ఎల్లయ్య, రాచకొండ రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులైన
# విద్యార్థులపై దాడి చేసిన మోదీ పాపం ఊరికే పోదు





**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్** దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులైన విద్యార్థులపై దాడి చేసిన మోదీ పాపం ఊరికే పోదని రంగారెడ్డి జిల్లా పీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ ను ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన జీహెచ్ఎంసీ పరిధిలోని జిల్లెల గూడ కట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. వరుస నీట్ పేపర్ లీకేజీలపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారిని అణచివేయడం మోదీ ప్రభుత్వ విధానంగా మారిందని ఆయన విమర్శించారు. ఇన్నిసార్లు పేపర్ లీక్‌తో విద్యార్థుల జీవితాలు రోడ్డున పడుతున్నా, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని, నిరసన తెలిపిన వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇంత వ్యతిరేకత వస్తున్నా కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నోరు విప్పకపోవడం సిగ్గుచేటన్నారు. దేశంలో రోజు రోజుకూ లా అండ్ ఆర్డర్ వ్యవస్థ క్షీణిస్తోందని, స్వయంగా పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకే రక్షణ లేని పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, విద్యార్థులను, ప్రజలను ఇబ్బంది పెడుతున్న మోదీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు చెంపపెట్టులా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించి, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులైన విద్యార్థులపై దాడి చేసిన మోదీ పాపం ఊరికే పోదని మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో పీసీసీ జనరల్ సెక్రటరీ చిగురింత పారిజాత నరసింహారెడ్డి , మహేశ్వరం నియోజక వర్గంలోని జిల్లెలగూడ మున్సిపాలిటీ, ప్రశాంతి హిల్స్, బడంగ్పేట్, బాలాపూర్, మీర్పేట్, జిల్లా సెక్రటరీ లు, డివిజన్ ప్రెసిడెంట్ లు, డివిజన్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు, యువకులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీజేపీ విద్యార్థుల భవిష్యత్ తో ఆటలు ఆడుకుంటుంది

**బీజేపీ పార్టీతో పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం**
**కేఎల్ఆర్ ఆగ్రహం**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** ఢిల్లీలో నీట్ పేపర్ లీక్ పై శాంతియుత నిరసనలు చేపట్టిన యువతపై నిరంకుశంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మండి పడ్డారు. యువత ప్రాథమిక హక్కులను అణిచివేసేందుకు బీజేపీ కేంద్ర సర్కార్, ప్రధాని మోడీ సర్కార్ కుట్రలు చేస్తుందని కే. ఎల్. ఆర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని విద్యార్థులు, యువత న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని కిచ్చెన్న కోరారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ సహా ప్రధాని నరేంద్రమోడీ రాజీనామా చేయాలని లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థులపై పోలీస్ లాఠీలు ఝులిపించి.. కేసులతో వారి భవిష్యత్ తో ఆటలు ఆడుకుంటుందని కేంద్రంపై కిచ్చెన్నగారు మండిపడ్డారు. బీజేపీ పక్షపాత దోరణి, జవాబుదారి తనాన్ని మరిచి మోడీ సర్కార్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. మహేశ్వరం అసెంబ్లీ సహా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర వైఖరిని నిరసిస్తూ శాంతియుత ఆందోళనలకు దిగిన విషయాన్ని గుర్తు చేశారు.

## లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ నీట్ పరీక్ష పత్రాలను అమ్ముకుంటున్న కేంద్ర ప్రభుత్వం



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్** రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ ను ఖండిస్తూ నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ మహేశ్వరం మండల కేంద్రంలో మహేశ్వరం మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రేస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టు సందర్భంగా జరిగిన వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలను కాంగ్రేస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. కేంద్రంలో అధికారం చేతిలో ఉందని విద్యార్థులపై, విపక్ష నేతలపై పోలీసుల చేత జులుం ప్రదర్శించడం సరికాదని, ఇలాంటి నిరంకుశ చర్యలతో బీజేపీ ప్రభుత్వానికి కేంద్రంలో గద్దె దిగే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ నీట్ పరీక్ష పత్రాలను అమ్ముకుంటున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడం విద్యార్థులు చేసిన తప్పా అని నిలదీశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ప్రతీసారి నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ కావడం సర్వసాధారణంగా మారిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మహేశ్వరం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్,, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య , మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ , కూన యాదయ్య , మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షుడు ఎర్ర చంద్రమోహన్, సర్పంచులు చేపంగి ప్రవీణ్ , మాజీ సర్పంచ్ కంది రమేష్ , పట్టణ అధ్యక్షుడు లాజర్ , డైరెక్టర్లు, ఉప సర్పంచులు శ్రీశైలం, గణేష్, మంత్రి బాల్రాజ్, నరసింహ యాదవ్ పలువురు కాంగ్రేస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వన మహోత్సవం

**2 వేల మొక్కలు నాటి పచ్చదనానికై గ్రామస్తుల ప్రతిజ్ఞ**




**మన తొలివెలుగు, తెలంగాణ బ్యూరో ప్రతినిధి కనుగుల సాయి కిషోర్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యమే బలమనే సందేశంతో నందిగామ మండలంలోని నర్సప్పగూడ గ్రామంలో బుధవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోడిచెర్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన రహదారులు, ప్రభుత్వ సంస్థల ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు తదితర ప్రాంతాల్లో సుమారు 2,000 మొక్కలను నాటి పచ్చదన విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోడిచెర్ల రాజేశ్వరి మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో చెట్లు అత్యంత కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని పచ్చని నర్సప్పగూడగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని గ్రామస్తులు నిర్ణయించారు. ప్రతి మొక్కను జీవంతో పెంచుతూ గ్రామాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు కృషి చేస్తామని సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో నిర్వహించిన ఈ వన మహోత్సవం కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే కాకుండా, ప్రకృతి సంరక్షణ పట్ల సామాజిక బాధ్యతను మరింత బలోపేతం చేసిన ఆదర్శ కార్యక్రమంగా నిలిచింది.

## పరిహారం పెంచాలని నిరాహార దీక్ష



**మన తొలివెలుగు ఇబ్రహీంపట్నం ప్రతినిధి సీ. హెచ్ రాజు :** ప్రభుత్వం సేకరిస్తున్న అసైన్డ్ భూములకు పరిహారం పెంచి రైతులకు న్యాయం చేయాలని యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో భూ పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్, నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పరిశ్రమల స్థాపన కోసం సర్వే నెంబర్లు 19, 68, 127 లో 677.29 ఎకరాలు సర్వే చేశారని, అయితే ఆ సర్వేలో అనేక లోపాలు అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రైతుల అభిప్రాయాలను పట్టించుకోకుండా వారి హక్కులను కాలరాస్తూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం పెంచి సర్వే చేసిన భూముల వివరాలను తెలుపాలని ఏడీ సర్వేయర్ తో రీ-సర్వే చేపట్టాలని ప్రత్యేక అధికారిని నియమించి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్వే నెంబర్లతో కూడిన జాబితాను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్లనే మింగేస్తున్న నిర్మాణాలు

**మెయిన్ రోడ్డు వద్ద 60 ఫీట్ల రూల్ గాలికి..!**
**మున్సిపల్ కమిషనర్‌కు డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం ఫిర్యాదు**
**అక్రమ నిర్మాణాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**మన తొలివెలుగు, మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ నిబంధనల ఉల్లంఘనలు పరాకాష్ఠకు చేరుతున్నాయి. పట్టణాభివృద్ధిని, ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి కొందరు ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేపడుతుండటంపై డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘం అధ్యక్షులు గుమ్మిడేల్లి పరశురాములు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గుమ్మిడేల్లి పరశురాములు మాట్లాడుతూ.. మున్సిపల్ నిబంధనల ప్రకారం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నిర్మించే భవనాలు కనీసం 60 ఫీట్ల దూరం వదిలి నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. కానీ, చాలామంది యజమానులు అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని, టౌన్ ప్లానింగ్ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతూ మెయిన్ రోడ్డును ఆనుకునే అక్రమంగా గృహాలు, వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

